క్లుప్తంగా

యూనియన్ బ్యాంక్‌లో సేవల పునరుద్ధరణ

అమరచింత: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో బుధవారం బ్యాంకు సేవలు యథావిధిగా కొనసాగాయి. మూడు రోజుల క్రితం బ్యాంకులో చోరీకి విఫలయత్నం కావడంతో రెండు రోజులు బ్యాంకు సేవలు నిలిపేశారు. బుధవారం యథావిధిగా అధికారులు ఖాతాదారులకు సేవలు అందించారు. బ్యాంకులో సీసీ కెమెరాల పునరుద్ధరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. వినియోగదారులకు సేవలు అందిస్తున్నామని బ్యాంకు మేనేజర్ శివశంకర్ తెలిపారు.

అన్నదాన సత్రానికి రూ.లక్ష విరాళం



అలంపూర్ : అలంపూర్ క్షేత్ర ఆలయాలను హైదరాబాద్‌కు చెందిన బాలజీ ప్రవీణ్ సింగ్ ఆయన భార్య శ్వేతతేజ్‌లు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి, శ్రీజోగుళాంబ అమ్మవారి ఆలయ సముదాయంలోని నిత్యాన్నదానానికి రూ. 1,00,001 చెక్కు విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి



ఎర్రవల్లి: మద్యానికి బానిసై అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల పీపీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాలు.. పెబ్బేర్ మండలం రంగాపురం గ్రామానికి చెందిన నారాయణదాస్ మల్లేష్ (35) బార్బర్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గతేడాది భార్య మృతి చెందగా మనస్థాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. బుధవారం కొండపేట శివారులోని విజయ్ హోటల్ షెడ్‌లో మృతిచెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడి కుమారుడు రోహిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



ఎర్రవల్లి: మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మందా వెంకట్రాముడు మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ బుధవారం పుటాన్‌దొడ్డికి చేరుకొని వెంకట్రాముడు భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో శంకర్, వెంకటన్న, ఈదన్న, ఆదాం, రవీంద్రబాబు, శంకరన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో మున్సిపల్ ముట్టడి



అమరచింత: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ జీరో బిల్లు, గ్యాస్ సబ్సిడీలు అందక ప్రజలు సతమతమౌతున్నారని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని గురువారం చలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాస్‌లైన్ పార్టీ మండల కార్యదర్శి రాజన్న తెలిపారు. పట్టణంలోని ఆయా వార్డులలో బుధవారం ఇంటింటికి వెళ్లి గ్యాస్ సబ్సిడీ, జీరో బిల్లులు వర్తిస్తున్నాయా లేదా అన్న విషయాలను ఇంటి యాజమానులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నామని చెబుతున్న ఇందుకు మున్సిపల్ అధికారులు సకాలంలో వాటి వివరాలను పంపకపోవడంతో సబ్సిడీ అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం బాధిత లబ్ధిదారులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు పాల్గొని సమస్యను పరిష్కరించే వరకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ప్రసాద్, భక్తి, కురుమన్న, సామేలు, మసలమని, రాంచందర్, జిలాని, ప్రేమరత్నం, పలువురు పాల్గొన్నారు.

ఈ రోడ్ల దుస్థితి మారదా?

- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న ప్రజలు



చెన్నిపాడు - మానవపాడు వెళ్లే రోడ్డు దుస్థితి

మానవపాడు: ప్రభుత్వాలు మారుతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు మారుతున్నారు. గ్రామాల్లో రోడ్ల దుస్థితి మాత్రం మారడం లేదు. గుంతలమయమైన రోడ్లతో మండల ప్రజలు నరక యాతన పడుతున్నారు. మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతమయంగా మారి అధ్వాన్నంగా తయారయ్యాయి. మండల కేంద్రం నుంచి చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చండూరు, బోరవెల్లి, పల్లేపాడు గ్రామాల మధ్య రోడ్లు గుంతలమయంగా మారాయి. బీటీ రోడ్లు ధ్వంసమై పెద్దపెద్ద గుంతలుగా ఏర్పడి వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడు మార్గాల గుండా ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్లపై రాత్రుళ్లు ప్రయాణించాలంటే భయంగా ఉందని వాపోతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు పనులు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

వర్షం పడితే అవస్థలు..

మానవపాడు మండల కేంద్రంనికి వెళ్లాలంటే గుంతలు మయంగా రోడ్లు ఉన్నాయి. వర్షం పడితే నీటి కుంటలను తలపిస్తాయి రోడ్లు. పాఠశాలల బస్సులు, ఆటోలు, వాహనాలు ఈ రోడ్డు గుండానే కర్నూల్, అలంపూర్ చౌరస్తాకు వెళ్తుంటాయి. గుంతల రోడ్లతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రజలు ప్రాణాలు పోకముందే రోడ్డకు మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులను మండల ప్రజలు కోరుతున్నారు.



చెన్నిపాడు- పెద్దపోతులపాడు మధ్య ప్రమాదకరంగా బ్రిడ్జి రోడ్డు

మరమ్మతులు చేస్తాం..

మానవపాడు నుంచి చెన్నిపాడు, పెద్దపోతులపాడు గ్రామాల వరకు గుంతలు పూడ్చడం కోసం రూ.10 లక్షలు, 6.9 కిలోమీటర్లకు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణం, తదితర పనులకు రూ.4 కోట్లతో గతంలో టెండర్ ప్రక్రియ నిర్వహించినా సరైన స్పందన లేదు. త్వరలో టెండర్లు ఆహ్వానిస్తాం.

- రాజేశ్వరి, ఆర్‌అండ్‌బీ ఏఈ

రోడ్లు నిర్మించండి సారూ..

రోడ్లపై గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చెన్నిపాడు- మానవపాడు రోడ్డు మార్గం ప్రమాదకరంగా ఉంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుంది. రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోని భయందోళలో ఉన్నాం.

-శ్రీకాంత్‌రెడ్డి, మానవపాడు

బ్రిడ్జిపై ప్రమాదకరంగా ప్రయాణం..

మానవపాడు మండల కేంద్రానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చెన్నిపాడు- పెద్దపోతులపాడు మధ్య బ్రిడ్జి నిర్మించారూ... బ్రిడ్జి ఎత్తున్న ప్రమాకరంగా ఉంది. ఈ ప్రభుత్వంలోనైనా నాయకులు, అధికారులు స్పందించి రోడ్డకు మరమ్మతులు చేపట్టాలి.

-రవి, చెన్నిపాడు

పొగాకు నలక కొనండి సారూ..?



చెన్నిపాడులో పొగాకు నలకతో రైతులు

మానవపాడు: ఆరుగాలం కష్టించి పండించిన పొగాకు నలక కొనడం లేదంటూ నియోజకవర్గ రైతుల ఆందోళనలో చెందుతున్నారు. అలంపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రైవేట్ కంపెనీల యాజమానులతో ఒప్పందంతో పంటను రైతులు పొగాకు సాగుచేశారు. గత సంవత్సరం క్వింటా పొగాకు రూ. 15వేలు పలికింది. ప్రస్తుతం రూ. 15,500 ధర నిర్ణయించారు. కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగిపోందని, నిర్ణయించిన ధరకు రైతుబేళ్ల ధర వస్తలేదని నల్లగా అయిందని, పచ్చిగా ఉందని ప్రైవేట్ యాజమానులు సీఆర్ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం నలకను రూ. 14 వేలకు విక్రయించారు. ప్రస్తుతం నలక కొనడం లేదని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అప్పుడు.. కొంటాము..ఇప్పుడు కొంటాము అంటూ రైతును ఊరిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. కలాల్లో నలక నల్లగా మారితుందోనని దిగాలు చెందుతున్నారు. పొగాకు బేళ్లకు సంపూర్ణ మద్దతు ధర రూ. 15,500 వచ్చే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. విక్రయించని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలలో పరిశుభ్రత ఎక్కడ..?



మానవపాడు: ప్రభుత్వ పాఠశాలలో చెత్తా చెదారంతో పాటు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 468 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల చుట్టూ ఉన్న ఆవరణలో చెత్తా చెదారం పెరుకుపోయిందని విద్యార్థులు వాపోతున్నారు. పందులు పాఠశాలలో సంచరించడం వల్ల రోగాల బారిన పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అనేకమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకునే నాథుడు కరువయ్యారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వడ్డేపల్లి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు



ధరూరు ఎంబీ చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్, సంఘ పెద్దలు

వైభవంగా అయ్యప్ప శోభాయాత్ర..



శోభాయాత్రలో ఊరేగుతున్న అయ్యప్ప స్వామి



కోలాటం ఆడుతున్న చిన్నారులు

అయిజ: మండల కేంద్రంలో బుధవారం అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తిని ప్రధాన వీధుల్లో మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. వైభవంగా నిర్వహించిన శోభాయాత్రలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి అయ్యప్ప స్వామి ఆలయంలో మాలధారులు మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పెద్ద చింతరేవులలో ఎంపీ పూజలు



పెద్దచింతరేవుల పూజలు చేస్తున్న ఎంపీ డీకే అరుణ

ధరూరు : మండల పరిధిలోని పెద్దచింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం, త్వరలో జరగనున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అర్చకులు కిష్టాచార్యులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామాంజనేయులు, రాంచంద్రారెడ్డి, నర్సన్‌దొడ్డి కృష్ణారెడ్డి, హన్మంతరాయ, ఆలయ ధర్మకర్త గిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో సీఐ ప్రత్యేక పూజలు

మల్దకల్ : ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారిని బుధవారం గద్వాల సీఐ శ్రీను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యాచంద్రారెడ్డి, అర్చకులు మధుసూధనాచారి, రవిచారి, అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నందికర్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కలశాల ఊరేగింపు

గద్వాలటౌన్ : జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహస్ర కలిశాభిషేక ఊరేగింపు చేపట్టారు. 1008 మంది భక్తులు కలశాలతో నిర్వహించిన ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది. మాలధారులు అయ్యప్ప స్వాములతో పాటు మహిళలు, ఇతర భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అయ్యప్ప సేవలో తరించారు. రాత్రి నిర్వహించిన మహా పడిపూజ కనుల పండువగా సాగింది. కార్యక్రమంలో మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.



ఊరేగింపులో అయ్యప్ప స్వాములు, భక్తులు

మహిళా కళాశాల భవనానికి భూమిపూజ

అలంపూర్ రూరల్ : అలంపూర్ నుంచి శింగవరం గ్రామ మార్గ మధ్యలోని కస్తూర్బా పాఠశాల వద్ద రూ.2.25 కోట్లతో మంజూరైన ఇంటర్ మహిళా కళాశాల భవనానికి ఎమ్మెల్యే విజేయుడు బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే జోగుళాంబ దేవి, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అదే విధంగా తెలంగాణ అతిథి గృహంలో వివిధ గ్రామలకు చెందిన సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ.2,66,500 చెక్కులు అందజేశారు. పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీలో జరిగిన న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు. మండల పరిధిలోని బుక్కాపూరం గ్రామనికి చెందిన మహేశ్వర్ రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేకర్‌రెడ్డి, కౌన్సిలర్ సుష్మ, నాయకులు శ్రీనివాసరెడ్డి, సదానందమూర్తి, రుక్కుద్దీన్ వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నాగరాజ్ యాదవ్, పరుషరాముడు, బాషా తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

ఎమ్మెల్యే పరామర్శ..

అయిజ: మున్సిపాలిటీలోని 4వ వార్డు కౌన్సిలర్ కలుకుంట్ల నాగమ్మ (77) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె అంత్యక్రియల్లో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వివిధ పార్టీల, సంఘాల నాయకులు నాగమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ధరూరులో బాలికల నృత్య ప్రదర్శన

సంబరంగా నూతన సంవత్సర వేడుకలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు బుధవారం సంబురంగా జరుపుకున్నారు. గ్రామ, పట్టణాలు, చిన్న పెద్దా తేడా లేకుండా అందరు కలిసి కట్టుగా వేడుకల్లో పాల్గొని సంబరాలో మునిగి తేలారు. కలిసిన ప్రతి ఒక్కరూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్త సంవత్సరంలో కొత్త ఆశలతో 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఇళ్ల ముందు రంగవల్లులతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజోళి: మండల కేంద్రం రాజోళితో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కేటీదొడ్డి: మండంలోని వెంటాపురం శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు.

అయిజ: మండల కేంద్రంలో బుధవారం అఖిల పక్షం కమిటీ నాయకులు నూతన సంవత్సరం వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, వినోద్ కుమార్, పల్లయ్య, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు బుధవారం మండల కేంద్రంలో పర్యటించారు. అయ్యప్ప స్వామి శోభాయాత్రలో పాల్గొన్నారు.

ధరూరు : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎంబీ షాలేము చర్చిలో పాస్టర్ పీసీ యూధా ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బైబిల్ ప్రవచనాల ఆధారంగా వాక్య సందేశం చేశారు.

శాంతినగర్ : వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలంపూర్ : జోగులాంబ శక్తి పీఠంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు పూజలు చేశారు. ప్రముఖులు, నాయకులు, అధికారులు పూజల్లో పాల్గొన్నారు. అలంపూర్ చౌరస్తా కూడలిలో జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు.

ఉండవెల్లి : నూతన సంవత్సర వేడుకలు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉత్సాహంగా జరుపుకున్నారు. సీఐటీయూ కార్యాలయంలో హమాలీ సంఘం సభ్యులు కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

ఎర్రవల్లి: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో చర్చి ఫాస్టర్ల సంఘ పెద్దలతో కేక్ కట్ చేసి ప్రత్యేక సందేశాలు ఇచ్చారు.



ఉండవెల్లిలో నూతన సంవత్సర వేడుకల్లో సీఐటీయూ నాయకులు



అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయంలో భక్తులు



కేటీదొడ్డిలో నూతన సంవత్సరం సందర్భంగా ఆలయంలో భక్తుల పూజలు



ధరూరులో ప్రత్యేక ప్రార్థనల్లో పాస్టర్ పీసీ యూధా ప్రసద్, సంఘ పెద్దలు.



అయిజలో న్యూఇయర్ వేడుకల్లో అఖిలపక్షం కమిటీ నాయకులు



ఎర్రవల్లి చర్చిలో..